క్లుప్తంగా

రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

పెద్దాపురం: మున్సిపల్ కౌన్సిల్ సర్వ సభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఉదయం 10.30 గంటలకు మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన ఉంటుందన్నారు. కౌన్సిల్ సభ్యులు, ఆయా మున్సిపల్ విభాగాల అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

జగనన్న సురక్ష సర్వే పరిశీలన



పీబీ దేవంలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

సామర్లకోట: జగనన్న సురక్ష సర్వేను ఎంపీడీఓ డి.శ్రీలలిత బుధవారం పరిశీలించారు. మండల పరిధిలో పీబీ దేవం ఒకటో సచివాలయం పరిధిలో వలంటీర్లు ఇంటికి వెళ్లి ప్రజలకు కలిగిస్తున్న అవగాహనపై సమాచారం సేకరించారు. సచివాలయం పరిధిలో ఉన్న ప్రజలందరికీ సేవలు అందేలా చూడాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు మలకల సూరిబాబు, సర్పంచ్ నీలపాల సత్యనారాయణ, సొసైటీ అధ్యక్షుడు మలకల వరలబాబు, పంచాయతీ కార్యదర్శి రామ్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఈఓపీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి ఆధ్వర్యంలో వలంటీర్ల సర్వేను పరిశీలించారు.

లబ్ధిదారులకు వరం జగనన్న సురక్ష

గండేపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం లబ్ధిదారులకు ఓ వరమని ఎంపీపీ చలగళ్ల దొరబాబు అన్నారు. మండలంలోని ఉప్పలపాడు, తాళ్లూరు గ్రామాల్లో బుధవారం జగనన్న సురక్షపై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు పూర్తి స్థాయిలో అందించేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. అనంతరం గృహసారథులు, వలంటీర్లకు జగనన్న సురక్ష కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సచివాలయాల మండల కన్వీనర్ తాళ్లూరి మధు, ఉప్పలపాడు సర్పంచ్ అడబాల ఆంజనేయులు, జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యులు ఒబిణ్ణి వీరబాబు, ఎంపీటీసీ చెల్లూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు పంచారామ క్షేత్రంలో పూజలు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం శ్రీకుమారా రామభీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని విష్ణుమూర్తి ఆలయంలో గురువారం స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరుగుతాయని ఈఓ డి.నాగమల్లేశ్వరరావు తెలిపారు. ఆషాఢ శుద్ధ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేయనున్నట్టు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్ని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

కొత్తపల్లి: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచవలసిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని ఎంపీడీఓ అబ్రహం లింకన్ అన్నారు. మండలంలోని వాకతిప్ప గ్రామ సచివాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. జగనన్న సురక్ష సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సర్వేను వేగంగా పూర్తి చేయలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పించాలన్నారు. చెత్తను రోడ్లు, ప్రధాన కూడళ్లలో వేయకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడానికి అవసరమైన అన్నిరకాల ఆధునిక పనిముట్లను పంచాయతీలకు అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మానవత్వంతోనే నైతికతకు గుర్తింపు

కాకినాడ: మానవత్వం పతనం వైపు పయనించినప్పుడు నైతిక విలువలు కూడా దిగజారిపోతాయని జైన మత సాధ్వీలు ఆత్మదర్శన శ్రీజ, సంయాగ్ దర్శన సాధ్వి, చారుదర్శన సాధ్వి పేర్కొన్నారు. బుధవారం కాకినాడ చేరుకున్న ఆదితానా మతగురువులకు ఘనస్వాగతం లభించింది. ముగ్గురు సాధ్వీలు కాకినాడ చేరుకుని జైన్ మతస్తుల రాజేంద్రభవన్‌లో బస చేశారు. అక్కడ ఐదు నెలల పాటు ప్రవచనాలు, ఉపవాస దీక్షలు చేయనున్నారు. ఇక్కడకు ర్యాలీగా చేరుకున్న వీరికి నగరంలోని జైన్ సమాజంతో పాటు ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న ఘనస్వాగతం పలికారు. సాధ్వీలు మాట్లాడుతూ భగవాన్ మహావీరుడు, గౌతమ బుద్ధుడు, స్వామి వివేకానంద, మహాత్మగాంధీ, గురుదేవ్ తులసి, ఆచార్య మహాప్రజ్ఞ వంటి సమాజానికి మార్గదర్శకులుగా నిలుస్తారన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ ఇక్కడ స్థిరపడిన జైన్‌లు ఆధ్యాత్మిక తత్వాకు, సేవా తత్పరతకు నిదర్శనంగా, మారుపేరుగా నిలుస్తారన్నారు. సాధ్వీలు ఇచ్చే ప్రవచనాలు, సందేశాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజానికి ప్రయోజనం కలిగేలా మరిన్ని సేవలు అందించాలని ఎమ్మెల్యే ద్వారంపూడి సూచించారు.

అధిక దిగుబడికి విత్తన శుద్ధి

- పంటల సాగులో విత్తన ఎంపిక కీలకం
- విత్తనాలు నాటేటప్పుడు జాగ్రత్తలు తప్పనిసరి
- రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



గొల్లప్రోలు మండలంలో తయారు చేసిన నారుమడి

పిఠాపురం: తొలకరి పలకరించడంతో రైతులు ఖరీఫ్ పనులు ప్రారంభించారు. వాణిజ్య పంటలకు పుట్టినిల్లయిన పిఠాపురం నియోజకవర్గంలో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. గొల్లప్రోలు మండలంలో వాణిజ్య పంటల సాగు ప్రారంభమైంది. రైతులు నారు మళ్లు వేసే పనిలో ఉన్నారు. పంటల సాగులో కీలకం దశ విత్తనం నాటడం. విత్తనం ఎంపికతోనే పంటల దిగుబడి ఆధారపడి ఉంటుంది. మంచి విత్తనం నాటితే సగం ఖర్చు తగ్గించుకున్నట్లే. విత్తనం నాటే ముందు పలు జాగ్రత్తలు పాటిస్తే మరింత మేలు జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. విత్తు నాటేటప్పుడు రైతులు జాగ్రత్తలు పాటించాలని, విత్తన శుద్ధి చేసుకోవాలని ఉద్యాన శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఈ మేరకు అధికారులు గ్రామాల్లో పర్యటించి విత్తనశుద్ధి తదితర విషయాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

జోరుగా నారుమళ్ల తయారీ

గొల్లప్రోలు మండలంలో రైతులు మిరప, వంగ, టమాటా, బీర, బెండ తదితర తదితర వాణిజ్య పంటలను సాగు చేస్తారు. ఇటీవల వర్షాలు పడడంతో రైతులు నారుమళ్లు వేస్తున్నారు. విత్తనాలు నాటే సమయంలో రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని గొల్లప్రోలు ఇన్‌చార్జ్ ఉద్యాన శాఖాధికారి పి.అరుణ్‌కుమార్ సూచిస్తున్నారు. రైతులు నారు మళ్లు వేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు.

నారు పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు



మిరప నారు మడిలో కలుపు తొలగిస్తున్న రైతు

కిలో విత్తనానికి 3 గ్రాముల థైరమ్ , కేప్టన్ కలిపి శుద్ధి చేసుకోవాలి. విత్తనాలను ఎత్తయిన ప్రదేశంలో (15 సెంటీ మీటర్ల ఎత్త) మాత్రమే నాటు కోవాలి. దీంతో భారీ వర్షాలు పడినా ఎక్కువ నీరు నిల్వ ఉండకుండా నారును రక్షించుకోవచ్చు. తెగుళ్లు రాకుండా నాడు మళ్లలో బైటాక్స్ 3 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి 2 నుంచి 3 సార్లు పిచికారీ చేసుకోవాలి. విత్తనాలను షెడ్ నెట్‌లలో పెంచుకోవడం ద్వారా వైరస్, తెగుళ్ల నుంచి రక్షించుకోవచ్చు. విత్తనాలను ట్రేల్లో పెంచితే ఎక్కువ మొలక శాతం, చీడపీడలు, తెగుళ్ల ప్రభావం తక్కువగా ఉంటాయి. రవాణా చేసుకోవడం సైతం సులభంగా ఉంటుంది. నారు మడితో పాటు పంట వేసే పొలంలో కూడా వేపపిండి వేసుకోవాలి. ఫిప్రోనిల్ గ్రాన్యూల్స్ 8 కేజీలు ఎకరానికి వేసుకోవాలి. నీలి రంగు జిగురు అట్టలను పొలంలో తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలి.



పి అరుణ్ కుమార్

రీ సర్వేలో తేడాలను సరిదిద్దండి

- అధికారులను కోరిన ప్రజాప్రతినిధులు
- గొల్లప్రోలు మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రామయ్యమ్మ

పిఠాపురం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూముల రీ సర్వేలో వివిధ కారణాల వల్ల వచ్చిన తేడాలను సరిదిద్ది రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని ప్రజాప్రతినిధులు అధికారులను కోరారు. గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ అరిగెల రామయ్యమ్మ అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ వులవకాయల నాగలోవరాజు మాట్లాడుతూ సమగ్ర భూసర్వేలో ఎక్కువ మందికి జాయింట్ పాస్ బుక్‌లు వచ్చాయన్నారు. గొల్లప్రోలు మండలంలో రైతుల ఖాతాలు 2 వేలు వరకు ఉంటే 1300 మందికి జాయింట్ పాస్ బుక్‌లు వచ్చాయని వీటిని తొందరగా సరి చేయాలన్నారు. వీటిని సరిచేయకపోతే రైతుల మధ్య చిచ్చురేపిన వారు అవుతారని అధికారులను హెచ్చరించారు. దీనిపై డిప్యూటీ తహసీల్దార్ వీరాస్వామి స్పందిస్తూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళతామని తెలిపారు. రబీలో పంట నష్టపోయిన రైతుల పేర్లు నమోదు చేశారని, ఎవరెవరికి ఎంతెంత నష్ట పరిహారం వచ్చిందో తెలియజేయాలని జెడ్పీటీసీ వులవకాయల నాగలోవరాజు కోరారు. దీనిపై మండల ఏఓ సత్యనారాయణ మాట్లాడుతూ రబీలో పంట నష్టపోయిన రైతులకు రూ.32 లక్షల పరిహారం వచ్చిందన్నారు. మరో నాలుగు రోజుల్లో కాలువలకు నీరు వదుతామని చెబుతున్నారని, కాని కొన్ని చోట్ల కాలువలు అధ్వానంగా ఉండడంతో పంటల సాగుకు ఇబ్బందులు తలెత్తుతాయని ప్రత్యేక ఆహ్వానితుడు అరిగెల రామయ్యదొర, మల్లవరం ఉప సర్పంచ్ మనిబాబు సమావేశం దృష్టికి తీసు వచ్చారు. దీనిపై నీటిపారుదల శాఖ ఏఈ పద్మజ మాట్లాడుతూ ఆయా పనులకు ప్రతిపాదనలు పంపించామని, త్వరలోనే వాటిని పూర్తి చేస్తామన్నారు. చేబ్రోలు హైస్కూల్ వద్ద మెయిన్‌రోడ్డుకు స్పీడు బ్రేకర్లు వేయాలని ఇప్పటికే చాలా సార్లు కోరామని, ఇప్పటికీ వేయక పోవడం వల్ల విద్యార్థులు ప్రమాదాలకు గురవుతున్నారని జెడ్పీటీసీ లోవరాజు ఆర్అండ్‌బీ అధికారులను ప్రశ్నించారు. అక్కడ వెంటనే స్పీడు బ్రేకర్లు వేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆర్అండ్‌బీ అధికారులు తెలిపారు. మల్లవరం, చెందుర్తి, దుర్గాడ రోడ్లకు త్వరలోనే మరమ్మతులు చెస్తామన్నారు. ఎంపీపీ అరిగెల రామయ్యమ్మ మాట్లాడుతూ అధికారులు సమావేశంలో ఇచ్చిన సమాధానాలకు అనుగుణంగా పనులు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు నేమాని ఆదివిష్ణు, బత్తిన మంగ, ఎంపీడీఓ శర్మ, పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని పీవీకి ఘన నివాళులు



కొత్తపల్లిలో పీవీ నరసింహారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కొత్తపల్లి: స్థానిక ఊరచెరువు సెంటర్‌లో బుధవారం భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతిని నిర్వహించారు. ఏఐసీసీ సభ్యుడు ఓలేటి రాయభాస్కరరావు ఆధ్వర్యంలో నరసింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాయభాస్కరరావు మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసిన మహోనత్న వ్యక్తి పీవీ నరసింహారావు అని కొనియాడారు. ఆయన గ్రామ సర్పంచి స్థాయి నుంచి ప్రధానమంత్రి స్థాయికి ఎదిగారన్నారు. యువత ఆయన అడుగుజాడల్లో నడవాలని సూచించారు. కార్యక్రమంలో దున్న చిట్టిబాబు, దుబాకుల గంగాధర్, అల్లడ ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు పాండురంగడి కల్యాణం

పురాతన ఆలయంలో ఏర్పాట్లు



ఆలయంలోని పాండురంగస్వామి

సామర్లకోట: పాండురంగడి కల్యాణానికి ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. 190 ఏళ్ల నాటి పురాతన ఆలయంలో ఏటా ఆషాఢ శుద్ధ ఏకాదశి నాడు రుక్మిణీ సమేత పాండురంగడికి కల్యాం చేయడం ఆనవాయితీ. నూతన దంపతులు ఆ రోజున స్వామి దేవేరులను దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని పంచారామ క్షేత్ర అభిషేక పండితుడు వేమూరి సోమేశ్వరశర్మ వివరించారు. మహారాష్ట్రలోని పండరీపురంలో ఉన్నట్టే పెద్దాపురం, సామర్లకోట మున్సిపాలిటీల కూడలిలో ఈ ఆలయం ఉంది. కల్యాణాన్ని పురస్కరించుకుని ఆలయం వద్ద తిరునాళ్లు జరుగుతాయి. సామర్లకోటకు చెందిన అయోధ్యల కాటయ్య నాయుడు తన పొలంలో దుక్కి దున్నుతున్న సమయంలో స్వామి, అమ్మవార్ల విగ్రహాలు లభించడంతో అక్కడే ఆలయం నిర్మించి ఏటా కల్యాణం నిర్వహిస్తున్నారు. వంశ పారంపర్యంగా కుటుంబ సభ్యులే ధర్మకర్తలుగా ఆలయాన్ని నిర్వహిస్తున్నారు. ఈ ఆలయంలో ఈశాన్యంలో నిర్మించిన బావిలో కొబ్బరినీళ్ల రుచిలో నీరు ఉంటాయి. కల్యాణాన్ని పురస్కరించుకుని ఆలయానికి రంగులు వేసి విద్యుదలంకరణలు చేసినట్టు ధర్మకర్త అయోధ్యల రాజేశ్వరరావు తెలిపారు.

ఇనుప చట్రాలు తొలగించాలని వినతి



పిఠాపురంలో తహసీల్దార్ త్రినాథరావుకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

పిఠాపురం: పంట కాలువపై అక్రమంగా ఏర్పాటు చేసిన ఇనుప చట్రాలు తొలగించి, నీటి పారుదలలో ఇబ్బందులు లేకుండా చూడాలని రైతులు కోరారు. ఈ మేరకు పిఠాపురం తహసీల్దార్ త్రినాథరావుకు వినతిపత్రం అందజేశారు. పిఠాపురం మండలం రాపర్తి, భోగాపురం, బి.ప్రత్తిపాడు, జములపల్లి, పి.రాయవరం గ్రామాలకు చెందిన రైతులు తమ పంట పొలాలకు రివాజుగా రావాల్సిన నీటిని రానీయకుండా కొందరు రైతులు గోకివాడ వద్ద పుట్ట కొండయ్య కాలువపై అక్రమంగా ఇనుప చట్రాలు అమర్చారన్నారు. ముక్కోల్లు రెగ్యులేటర్ నుంచి 9 కిలో మీటర్ల మేర ఉన్న ఈ కాలువ ద్వారా 1890లో కంచి రామన్న పంతులు డైరీ ప్రకారం గోకివాకు ఒక వంతు, తమ గ్రామాల పొలాలకు రెండు వంతులు నీటిని విడుదల చేయడం రివాజుగా ఉందన్నారు. అయితే పుట్టకొండయ్య కాలువపై గోకివాడ వద్ద ఆ గ్రామానికి చెందిన కొందరు రైతులు ఓపెన్ హెడ్ చానల్‌ను అనధికారికంగా ఇనుప చట్రాలు అమర్చారన్నారు. దీంతో తమ పంట పొలాలకు సక్రమంగా నీరు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై చర్యలు తీసుకోవాలని ఇప్పటికే పలు మార్లు జిల్లా ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేశామన్నారు. అయినప్పటికీ ఎవరు పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమంగా అమర్చిన ఇనుప చట్రాలను తొలగించి తమ గ్రామాలకు రావాల్సిన నీటి వాటా వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పిఠాపురం మండలం రాపర్తి, భోగాపురం, బి.ప్రత్తిపాడు, జములపల్లి, పి.రాయవరం గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

భూసేకరణ వేగవంతం చేయండి

- ఆర్డీవో సత్యనారాయణ



సమీక్షలో మాట్లాడుతున్న ఆర్డీవో సత్యనారాయణ

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్ మండలం వాకలపూడి నుంచి రాజానగరం వరకు విస్తరించనున్న ఏడీబీ రోడ్డు నిర్మాణానికి భూ సేకరణ పనులు వేగవంతం చేయాలని ఆర్డీవో ఎన్వీవీ సత్యనారాయణ ఆయా మండల తహసీల్దార్లను ఆదేశించారు. బుధవారం ఆర్డీవో కార్యాలయంలో కాకినాడ రూరల్, సామర్లకోట తహసీల్దార్లు, గ్రామ రెవెన్యూ అధికారులు, సర్వేయర్లతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడీబీ రోడ్డు విస్తరణకు సంబంధించి కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురం, రమణయ్యపేట, సామర్లకోట మండలం భీమవరం, జగ్గమ్మగారి పేట, పనసపాడు, వల్లూరు గ్రామాల్లో భూ సేకరణ వేగవంతం చేయాలని ఆదేశించారు. భూ సేకరణకు సంబంధించి రైతుల నుంచి వచ్చిన క్లెయిములపై త్వరితగతిన విచారణ చేసి ప్రతిపాదనలు సమర్పించాలని ఏడీబీ రోడ్డు విస్తరణకు సుమారు 81 ఎకరాల మేర అవసరమన్నారు. ఈ సమావేశంలో కాకినాడ రూరల్ తహసీల్దార్ వి.మురార్జీ, సామర్లకోట తహసీల్దార్ ఎస్ఎల్ఎస్ కుమారి, పరిపాలనాధికారి వరహాలయ్య, రెవెన్యూ సిబ్బంది గంపల నాగేశ్వరరావు, గోవిందు, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

రికార్డుల తనిఖీ



కొండెవరం పోస్టాఫీసులో రికార్డులు తనిఖీ చేస్తున్న కోమల్ కుమార్

కొత్తపల్లి: పోస్టాఫీసు ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలకు వివరించాలని రాజమహేంద్రవరం డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ పి.కోమల్ కుమార్ సూచించారు. మండలంలోని కొండెవరంలో పోస్టాఫీస్‌లో రికార్డులను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతివలకు ఎంతో లాభదాయకంగా ఉన్న మహిళా సమ్మాన్ పథకంలో ప్రతి మహిళా చేరాలని సూచించారు. అనంతరం గ్రామంలో పర్యటించి పోస్టాఫీస్ ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఎల్.శ్రీనివాసరావు, పోస్ట్ మాస్టర్ శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

ఒకటి నుంచి గురుపూర్ణిమ ఉత్సవాలు



విద్యుద్దీపాలంకరణలో బాబా ఆలయం

సామర్లకోట: స్థానిక స్టేషన్ సెంటర్‌లోని షిర్డి సాయి ఆలయం వద్ద జూలై ఒకటి నుంచి గురుపూర్ణిమ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు డి.అప్పారావు, కార్యదర్శి జి.సత్యనారాయణ విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల ఒకటి నుంచి మూడో తేదీ వరకు నిత్యం ఉదయం మేలు కొలుపు హరతి, అభిషేకాలు, పూజలు ఉంటాయన్నారు. రెండో తేదీ మధ్యాహ్నం ఆలయం వద్ద బాలికలచే పాటలు, కోలాటం, 3.30 నిమిషాలకు ఆలయం నుంచి బాబావారి పల్లకి, వాహన ఉత్సవ ఊరేగింపు ఉంటుందన్నారు. 3వ తేది గురుపూర్ణిమ సందర్భంగా తెల్లవారు జామున మేలుకొలుపు హరతి, బాబావారికి పంచామృతాలతో అభిషేకాలు, భక్తుల గోత్రనామాలతో పూజలు చేస్తారు. అనంతరం 11 గంటల నుంచి స్థానిక రైల్వే కల్యాణ మండపంలో భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం ఉంటుందని చెప్పారు.

జగనన్న సురక్ష సర్వే విజయవంతం చేయండి

జిల్లా గిరిజన సంక్షేమాధికారి విజయశాంతి



జగనన్న సురక్ష ఆన్‌లైన్ విధానాన్ని పరిశీలిస్తున్న విజయశాంతి

పెద్దాపురం: వచ్చే నెల నుంచి ప్రతి వార్డులో నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా గిరిజన సంక్షేమాధికారి పి.విజయశాంతి ఆదేశించారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని వాలుతిమ్మాపురం సచివాలయంలో సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించి వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులకు సూచనలు సలహాలిచ్చారు. ప్రతి లబ్ధిదారుడికీ రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమం అందాలనే ఉద్దేశంతో సీఎం జగన్ పలు సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. లబ్ధి పొందని వారిని గుర్తించి ప్రతి ఒక్కరికి సంక్షేమం అందేలా చూడాల్సిన బాధ్యత మనందరిపైన ఉందన్నారు. నెల రోజుల పాటు నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె సూచించారు. ఎంపీడీఓ అశోక్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి వరసాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీపాద శ్రీవల్లభస్వామికి ప్రత్యేక పూజలు



స్వామి వారికి పంచామృతాభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు

పిఠాపురం: స్థానిక దత్త క్షేత్రమైన శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో వేంచేసిన శ్రీపాద శ్రీవల్లభ స్వామి వారికి బుధవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. చిత్త నక్షత్రాన్ని పురస్కరించుకుని తెల్లవారుజామున ఆలయ అర్చకులు స్వామి వారికి పంచామృతాభిషేకం చేశారు. అనంతరం విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. వందలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ రెడ్డెం జనార్దనరావు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

దళారులను ఆశ్రయించవద్దు

కొత్తపల్లి: రైతులు, కౌలు రైతులు దళారులను ఆశ్రయించవద్దని మండల వ్యవసాయాధికారి జోగిరాజు సూచించారు. మండలంలోని వాకతిప్ప రైతు భరోసా కేంద్రన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనం కొనుగోలు నుంచి పంటను అమ్ముకునే వరకూ అన్ని ప్రక్రియలు గ్రామంలోనే జరగాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. ఆర్‌బీకేల్లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి నియోజకవర్గ కేంద్రంలోనూ విత్తనాలు, ఎరువుల నాణ్యతను పరిశీలించుకునేందుకు ప్రభుత్వం ల్యాబ్‌ను ఏర్పాటు చేసిందన్నారు. రైతులు ఆర్‌బీకేలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బైక్ చోరీ కేసులో వ్యక్తికి జైలు

కాకినాడ లీగల్: బైక్ చోరీ కేసులో వ్యక్తికి 7 నెలల జైలు శిక్ష విధిస్తూ కాకినాడ స్పెషల్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి ఎ.నాగమల్లేశ్వరి బుధవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం ఆకివీడు మండలం చిన కాపవరానికి చెందిన కుప్పల ఏసు అలియాస్ రమేష్ 2022లో నడకుదురు గ్రామంలో హోటల్ వద్ద ఉన్న బైక్‌ను చోరీ చేశారు. దీంతో కరప పోలీసులకు బైక్ యజమాని వీరభద్రరావు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. కోర్టు విచారణలో రమేష్ నేరం అంగీకరించడంతో 7 నెలల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

